# నీతి కథలు

1

Akhlaqui Kahaniyan-1
(Telugu)

# నీతి కథలు

## (మొదటి భాగం)

మూలం
మౌలానా అఫ్జల్ హుసైన్ M.A., Litt.

అనువాదం
అబ్బాదుల్లా B.A.
ఎం.డి. ముజాహిద్

HYDERABAD

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Neeti Kathalu - 1**

**Akhlaqui Kahaniyan-1 (Telugu)**

**TIP Series No. 33**

Compiled by : Maulana Afzal Hussain M.A., Litt.

Translated by : Abbadullah B.A., & M.D. Mujahid

All Rights Reserved with publishers

**9th Edition : August 2016**

Copies : 2000

Price : **Rs.15**

ISBN : 81 - 86826 - 58 - 0

Published by : Telugu Islamic Publications
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# 1. తల్లిదండ్రుల సేవ

పూర్వం హజ్రత్ షర్ఫుద్దీన్ అను ఒక మహాజ్ఞాని ఉండేవారు. తల్లిదండ్రుల సేవ చేయడంలో అతనికి అతనే సాటి. అల్లాహ్ అతన్ని అనుగ్రహించుగాక!

షర్ఫుద్దీన్ తల్లిదండ్రులకు అమిత గౌరవమర్యాదలతో కానవచ్చేవాడు. ఇచ్చిన ఆజ్ఞలను జవదాటడు. సతతం వినయవినమ్రుడయి వేచి ఉండేవాడు. అతని బాల్యంలో జరిగిన ఒక సంఘటన వినండి:

అతడు పిన్న వయస్కుడు. సమీపంలో అతని తల్లి ఒక మంచంపై మూలుగుతూ ఉంది. తనయుని పిలిచి "నాయనా! దాహమేస్తోంది. గుక్కెడు మంచినీళ్ళు ఇవ్వు దప్పిక తీర్చుకుంటా"నన్నది. చేతిలో గిన్నె తీసుకొని గబగబా వెళ్ళాడు షర్ఫుద్దీన్. కడవ నుండి కొన్ని చల్లని నీళ్ళు తీసికొని వడివడిగా తల్లి వద్దకు వచ్చాడు. కాని అప్పటికే ఆమెకు నిద్ర పట్టింది. కళ్ళు మూతలుపడ్డాయి. ఇప్పుడేం చేయాలి? నిద్ర నుండి మేల్కొలిపితే నిద్రాభంగంచే తల్లికి కష్టం కలుగుతుంది. నీళ్ళు త్రాగించలేకపోతే, తల్లి ఆజ్ఞ నెరవేర్చలేకపొయ్యానే అన్న బాధ మరో వైపు. చేసేదిలేక నీళ్ళ గిన్నె చేతిలో పట్టుకొని అలాగే నిలబడిపోయాడా బాలుడు. తల్లి ఎప్పుడు మేల్కొని నీళ్ళు అడుగుతుందో అన్న ధ్యాసలో పడక ప్రక్క ఉండిపోయాడు.

చాలా రాత్రి గడిచింది. తల్లి నిద్ర నుండి మేల్కొన్నది. కనులు విప్పి చూచింది. నీళ్ళ పాత్రతో నిలబడి ఉన్నాడు తనయుడు.

"అప్పటి నుండి నీవు నిలబడే ఉన్నావా నాయనా?" అని అంది తల్లి.

"అవునమ్మా ఇక్కడే ఉన్నా. నీకు మెలకువ రాగానే నీళ్ళు ఇద్దామని వేచి ఉన్నా"నని సమాధానమిచ్చాడు షర్ఫుద్దీన్.

ఆ ముద్దుల కుమారుని ముచ్చటయిన జవాబు విని సంతసించింది తల్లి. సుపుత్రుని పురోభివృద్ధికై అల్లాహ్‌ను ప్రార్థించింది.

పెరిగి పెద్దవాడయి గొప్ప మేధావిగా విరాజిల్లాడు షర్ఫుద్దీన్.

## 2. గురువుల పట్ల గౌరవం

పూర్వం హారూన్-అల్-రషీద్ అనే మహారాజు ఒకడు ఉండేవాడు. అతనికి అమీన్, మామూన్ అను ఇరువురు కుమారులుండేవారు. బాల్యంలో వారిరువురు ఒకే గురువు వద్ద విద్యాభ్యాసం చేసేవారు.

ఒకనాటి విషయం, అన్నదమ్ములిద్దరూ గురువు వద్ద కూర్చుని ఉన్నారు. ఏదో కారణంచేత గురువు అక్కడి నుండి పోవలసివచ్చింది. లేచి నిలబడ్డారు. ముందడుగు వేయనున్నారు. వెంటనే ఆ బాల సోదరులిద్దరూ గురువుగారి పాదరక్షల కోసం పరుగెత్తారు. గురువు అంటే అపార గౌరవం వారికి. వారిద్దరూ వివాదానికి దిగారు. దేనికొరకు?

గురువుగారి పాదరక్షలు నేను సరిపెట్టుతానని ఒకడంటే, లేదు, లేదు, నేనే సరిచేస్తానని ఇంకొకడు.

విద్యార్థుల వివాదాన్ని చూశారు గురువుగారు. తనపై వారికున్న గౌరవాన్ని గుర్తించారు. తగవును పరిష్కరించే మార్గాన్ని కనుగొన్నారు. చెరొక పాదరక్షను సరిపెట్టమన్నారు గురువుగారు. అలాగే వారిరువురు పాదరక్షలను సరిచేశారు. వాటిని ధరించి బయటికి వెళ్ళారు గురువుగారు.

ఈ విషయం మహారాజు వరకు వెళ్ళింది. ఆనందంతో పొంగిపొయ్యాడు మహారాజు. గురువు పట్ల తమ బిడ్డలు చూపిన ప్రేమ, గౌరవాన్ని ప్రశంసించాడు. దర్బారుకు పిలిచి తన బిడ్డలకు పారితోషికాలిచ్చాడు.

ఆ బాలురిరువురు పెద్దవారయి ప్రఖ్యాతిగాంచిన పాదుషాలయి రాజ్యమేలారు.

# 3. పెద్దలయెడ వినయం

అది మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి కాలము. ఒకనాడు వారి సమక్షంలో హజ్రత్ అబూబకర్ (ర), హజ్రత్ ఉమర్ (ర) కూర్చుని ఉన్నారు. ఇంకా ఇతరులు కూడా అక్కడే ఉన్నారు.

ప్రవక్త ఇలా అన్నారు:

"ఔన్నత్యంలో ఇంచుమించు ముస్లిమ్‌ల పోలిక కలిగి ప్రతి ఏటా ఫలాన్నిస్తూ ఎప్పటికీ పచ్చగా ఉండే వృక్షమేదో తెలుపండి?" అని ప్రశ్నించారు.

చెంతనున్న సహచరులిరువురూ మౌనం వహించారు. హజ్రత్ ఉమర్ (ర) గారి కుమారుడు హజ్రత్ అబ్దుల్లా (ర) కూడా అక్కడే ఉన్నారు. ఉద్రేకంతో జవాబివ్వడానికి ముందుకు రాబోయారు. ఆ చెట్టు ఖర్జూరపు చెట్టేనని చెప్పబోయారు. మళ్ళీ ఆగిపోయారు.

సభలో తండ్రిగారున్నారు. మహాపురుషులయిన పెద్దలున్నారు. వారందరూ మౌనంగా కూర్చున్నారు. ఇక తానే గనక జవాబిస్తే పెద్దలను అగౌరవపరచినట్లవుతుంది అని తలచి, తెలిసీ తెలియనివాని వలె ఊరుకున్నారు అబ్దుల్లా (ర).

కొంత కాలం గడిచింది. తండ్రికి ఈ విషయం తెలిసింది. తనయుని పిలిచి, "కుమారా! ఆనాడు నీకు తెలిసి ఉన్నను, ప్రశ్నకు సమాధానమివ్వక ఊరుకున్నావెందుకు? ఒకవేళ నీవు ప్రవక్త ప్రశ్నకు జవాబిచ్చి ఉంటే నేనెంత సంతోషించి ఉండేవాడను? ఎవరూ నోచుకోని భాగ్యం నా కుమారునికి దక్కిందని గర్వపడేవాడను కదా?" అన్నారు హజ్రత్ ఉమర్ (ర).

"నాన్నగారూ! పెద్దలయిన హజ్రత్ అబూబకర్ (ర) మరియు మీరు మౌనం వహించి ఉండగా నేనెలా జవాబివ్వగలను. అలా చేసినట్లయితే పెద్దలను అగౌరవపరచినట్లు కదా? అంచేత నిశ్శబ్దంగా ఉండిపోయాను" సవినయంగా సమాధాన మిచ్చాడు తనయుడు. కుమారుడు పెద్దలయెడ చూపిన వినయ వినమ్రతలకు, గౌరవానికి ఎంతో సంతోషించారు హజ్రత్ ఉమర్ (ర).

# 4. లజ్జ

అది మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బాల్యదశ. అప్పట్లో 'కాబా' గోడ కొద్దిగా కూలింది.

ఇక మక్కావాసులు ఈ గోడ పునర్నిర్మాణంలో పాల్గొంటున్నారు. పసిపిల్లలు కూడా పనిలో భాగం పంచుకుంటున్నారు. పిల్లవాళ్ళు చేయగలిగిందేమిటి? చిన్నచిన్న రాళ్ళు భుజాలపై మోసుకొనివచ్చి గోడ నిర్మించేవారికందిస్తున్నారు. ఆ బాలురలో మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడ ఉన్నారు.

కొద్దిసేపట్లో వారి భుజాలు నొప్పిపెట్టసాగాయి. కాని ప్రేమతో, ఉత్సాహంతో కూడిన పనికి అడ్డు ఉంటుందా? వెంటనే ఆ పసికందులు తమ తమ నడుము గుడ్డలు విప్పారు. వాటిని భుజాలపై పెట్టుకున్నారు. యధాతథంగా రాళ్ళను మోయసాగారు.

నిరంతరాయంగా రాళ్ళను మోయడం వల్ల మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) భుజాలు కూడ నొప్పిపెట్టాయి. బాధ పడుతూనే పనిచేస్తున్నారు. దూరాన నుండి వారి బాబాయి చూచారు. “నాయనా ! నీవు కూడా నీ నడుము గుడ్డను విప్పి భుజాన వేసుకో, లేకపోతే రాళ్ళు మోయుటలో భుజాలు నొప్పెడతాయి” అన్నారాయన. ఆజ్ఞ ఇచ్చింది బాబాయిగారు. దాన్ని పాటించుట తప్పనిసరి అయింది. కాని ప్రవక్త బాల్యం నుండే అమిత లజ్జ కలవారు. గుడ్డలు విప్పి నగ్నంగా నలుగురిలో తిరగగలరా? నడుము గుడ్డ విప్పబోతుండగానే సిగ్గుపడ్డారు. స్పృహతప్పి మూర్ఛపోయారు.

ఈ దృశ్యాన్ని ఆయన బాబాయి కన్నులారా చూశారు. అబ్బాయిలో ఉన్న లజ్జను గుర్తించారు. ఇక నగ్నంగా ఉండటాన్ని నిషేధించారు.

# 5. సలామ్ విశిష్టత

ఒకరినొకరు సలామ్ చేసుకోవడంలో పరస్పరం ప్రేమాభిమానాలు పెరుగుతాయి. హజ్రత్ అబ్దుల్లా (ర), హజ్రత్ ఉమర్ (ర) గారి పుత్రుడు, ప్రవక్త (సఅసం) సహచరులలో ఒకరు. వీరు అనుదినం ప్రవక్త ఆచరణను ఎంతో ధ్యాసతో గమనించేవారు. అదే ఆచరణననుసరించి మెలగేవారు.

మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చిన్న పెద్ద అన్న భేదం చూపకుండా ప్రతివారికీ సలామ్ చేసేవారు. ఆటలాడుకునే బాలురు కనిపించినా సలామ్ చేసేవారు. హజ్రత్ అబ్దుల్లా (ర) కు కూడా అదే అలవాటు వచ్చింది. కనబడిన వారందరికీ ఆయన అందరికన్నా ముందుగా సలామ్ చేసేవారు.

ప్రేమాదరణలనందుకొన్న ఆ మహనీయుని అలవాటు చూడండి: ప్రతి రోజు ఏ పనీ లేకపోయినా హజ్రత్ అబ్దుల్లా (ర) బజారుకు వెళ్ళేవారు. దారిలోని పేదలకు, దుకాణాలలోని ధనికులకు, బాటసారులకు మరియు కంటికగుపడిన పుర ప్రజలందరికీ సలామ్ చేసేవారు.

ఒక దినం ఒక వ్యక్తి హజ్రత్ అబ్దుల్లా (ర) తో "మహాశయా! మీరనుదినం బజారుకు వస్తున్నారు, కాని క్రయ విక్రయం మాటే లేదు, పోనీ ఎక్కడయినా కూర్చుంటారా అంటే అదీ లేదు, మరి మీరొచ్చిపోయే పనేమిటండీ" అని అడిగాడు.

"కేవలం సలామ్ చేయడానికే బజారుకు వస్తున్నా"ని జవాబిచ్చారు హజ్రత్ అబ్దుల్లా (ర).

సలామ్ చేయటానికి బజారుకు వెళ్ళటం క్రయ విక్రయ నిమిత్తం బజారుకు వెళ్ళే పనికంటే తీసిపోయిందేమీ కాదని తలంచేవారు హజ్రత్ అబ్దుల్లా (ర).

# 6. పిల్లలయెడ ప్రేమ

చాలా ఏండ్ల క్రితం జరిగిన సంఘటన. ఆ కాలంలో పశువుల వలె మనుషులు కూడ బజారులో అమ్మబడేవారు. నీతి నియమం లేని కొందరు దుర్మార్గులు ఒక చిన్నారి బాలుని దొంగిలించి దూరాన వున్న మక్కా పట్టణం చేరారు. పసి పిల్లవానికి వెలకట్టి అమ్మసాగారు. ఈ మాట చివరకు హ[జత్ బీబి ఖదీజా (రఅ) వరకు వెళ్ళింది. విన్నంతనే ఆమెకు జాలి వేసింది. వెంటనే బజారుకెళ్ళి పిల్లవానిని తానే కొన్నారు.

హ[జత్ ఖదీజా (రఅ) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సతీమణి. ఆ బాలుని మహా ప్రవక్త వద్దకు తెచ్చిందామె. పసి పిల్లలంటే అమిత ప్రీతి ప్రవక్త (సఅసం)కు. ఈ అనాధ పిల్లవానిని చూశారు. మరింత ప్రేమతో ఆ బాలుని సాకారు. ఏ దుర్మార్గుల చేతుల్లోబడి ఆ బాలుడు దురమయ్యాడో, ఇక తాము తప్ప ఆ పసికందుపై కనికరించేవారెవరూ లేరు. కనుక గారాబంతో పెంచసాగారు. ఇక ఆ బాలుడు కూడా ప్రవక్త (సఅసం) అంటే ముగ్ధుడయిపోయాడు. సతతం మహా ప్రవక్త (సఅసం) వెంటే వుండసాగాడు. ఈ విధంగా గడుస్తోంది అతని బాల్యం.

కొన్ని రోజులు గడిచాయి. కొడుకును పోగొట్టుకున్న తండ్రికి ఆ బాలుని జాడ తెలిసి, మహాప్రవక్త వద్దకు వచ్చారు.

హ[జత్ ఖదీజా (రఅ) ఆ బాలుని కొన్నారని తెలిసింది. వెలను వాపసు చేసి తన కొడుకును తీసుకుపోదలిచాడు తండ్రి. కాని కారుణ్యమూర్తి అయిన మహాప్రవక్త (సఅసం) ఆ ధనాన్ని తీసుకుంటారా? లేదు, డబ్బు తీసుకోకుండానే పిల్లవాణ్ని విడిచిపెట్టారు. ఇక బాలుడు తన ఇష్టం వచ్చిన వారివద్ద ఉండవచ్చునని చెప్పారు.

మహాప్రవక్త (సఅసం) ఆ పిల్లవానిని ఎంతో గారాబంతో పెంచారు. మంచి మంచి మాటలు నేర్పారు. ప్రేమానురాగాలతో పోషించారు. ఇట్టివారు ఆ బాలునికెక్కడ ప్రాప్తం కాగలరు? వెంటనే ఆ బాలుడు మహాప్రవక్త (సఅసం)

పాదాలను పెనవేసుకున్నాడు. తనను పెంచుతున్న మహాప్రవక్త (సఅసం) ను వదలి మరెక్కడికి వెళ్ళనన్నాడు.

చివరకు ఆ బాలుని తండ్రి నిస్సహాయుడయి మరలిపొయ్యాడు. కాని ఒక్క మాట మాత్రం ఆయనకు తృప్తి కలిగించింది. అదేమిటంటే తనయుడు తనతో రాకపోయినా ఫరవాలేదు. తన ఇంటికన్నా మిన్న ఆయన (సఅసం) ఇంటిలో పోషింపబడి సుశిక్షణను పొందుతున్నాడు. అంతకంటే ఇంకేం కావాలి?

## 7. నోరులేని జీవులపై కనికరం

ఒకప్పటి విషయం. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సహచరులొకరు ఎక్కడికో ప్రయాణం చేస్తున్నారు. కొంత దూరం వెళ్ళారు. మార్గంలో ఒక చిన్న అడవి వచ్చింది. అడవిలో నుండి "చీం చీం" అన్న శబ్దం వినబడింది. శబ్దాన్ని కనిపెడుతూ ఆ ధ్వని చోటుకు చేరుకున్నారాయన.

అక్కడ చిన్న చిన్న పక్షి పిల్లలున్నాయి. ఎగిరిపోయే శక్తిలేక కిచకిచలాడుతున్నాయి. బాటసారికి సంతోషం కలిగింది. వెంటనే దుప్పటి పరచి పక్షి పిల్లలన్నింటినీ అందులో వేసుకున్నారు. చక్కగా త్రోవపట్టి రాసాగారు. ఇంతలో పిల్లల మేత కోసం వెళ్ళిన పక్షి వచ్చింది. దుప్పట్లో నుంచి వస్తున్న పిల్లల కిచకిచ ధ్వని విన్నంతనే కంగారుపడింది. గత్యంతరంలేక గగనతలంలో వెర్రి కేకలు వేస్తూ బాటసారిని అనుసరించింది.

పక్షి కేకలు లెక్కచేయక ఆయన మహా ప్రవక్త (సఅసం) దగ్గరకు నేరుగ వచ్చారు. వచ్చి పక్షి పిల్లలను చూపెట్టారు. కన్నులు విప్పని ఆ పసికందులను చూడగానే మహా ప్రవక్త (సఅసం)కు అమితంగా జాలివేసింది. "పక్షి పిల్లలను ఎక్కడి నుండి తెచ్చావ"ని అడిగారు. ఇక జరిగిన వృత్తాంతమంతా వినిపించారు ఆయన అనుచరుడు. జాలి గుండె గల మహాప్రవక్త (సఅసం) ఎంతో బాధపడ్డారు. ఇటు తల్లికి దూరమైన పిల్లలకు, అటు పిల్లలకు దూరమయిన తల్లికి బాధ కలగడాన్ని ఆయన సహించగలరా? "వెంటనే వెళ్ళి ఆ పక్షి పిల్లలు ఎక్కడ ఉండేవో అక్కడే

వదలిరమ్మ"ని ఆజ్ఞాపించారు. బాటసారి వెళ్ళాడు. పక్షి పిల్లలను అడవిలో ముందున్న చోటే వదలి వచ్చాడు. నోరులేని జీవులను బాధ పెట్టరాదు.

## 8. పెద్దలకు దైవమార్గం చూపే పద్ధతి

హ(జత్ హసన్, హ(జత్ హుసైన్ వీరిద్దరు అన్నదమ్ములు, మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనుమలు కూడ. వీరిరువురి బాల్యంలో జరిగిన సంఘటన ఒకటి చదవండి:

ఒకనాడు వారివద్దకు ఒక పల్లెటూరి మనిషి వచ్చాడు. అతని నడవడిక చూస్తే మొరటుగా ఉంది. మాటల తీరును బట్టి అమాయకుడు కూడా.

నమాజ్ చేసే వేళ అయింది. వుజూ చేయ మొదలు పెట్టాడా పల్లెటూరి వ్యక్తి. వుజూ చేసే విధానంతో పరిచయం లేనివాడు. తనకు వచ్చినట్లు వుజూ చేయసాగాడు. ఈ విషయం సోదరులిరువురూ గమనించసాగారు. ఇక వుజూ విషయం సామాన్యమయింది కాదు. దైవాదేశం ప్రకారం వుజూ చేయాలి. దైవాదేశ విషయాల్లో దారితప్పినవారికి సరయిన మార్గం చూపడం ఎంతో ముఖ్యం. కాని ఏం చేయాలి? ఆ అమాయకుడు వయస్సులో వారిరువురికంటే చాలా పెద్దవాడు. తాము హఠాత్తుగా అతన్ని తప్పుపట్టి నిలదీయడం సమంజసం కాదు.

చివరకు సోదరులిద్దరూ ఒక ఉపాయం కనుగొన్నారు. చెరొక ముంతలో నీళ్ళు తెచ్చారు. వుజూ చేస్తూ కూర్చున్నారు. అమిత ఆదరణతో "ఏమండీ! మేమిద్దరం వుజూ చేస్తున్నాం. కాస్త చూడండి. మేము ఒకవేళ తప్పు చేస్తే సరిదిద్దండి" అని అన్నారా అమాయక మనిషితో. ఇక వుజూ చేయ మొదలెట్టారు. సక్రమంగా పూర్తి చేశారు. అమాయకుడు శ్రద్ధతో ఆ పద్ధతిని గమనించాడు. వుజూ చేయు విధానం తెలుసుకున్నాడు.

ఈ విధంగా సోదరులిద్దరూ తమకంటే వయసులో పెద్దవాడయిన వ్యక్తికి దైవాదేశ మార్గంలోని ఒక ముఖ్యాంశాన్ని తెలియపరిచారు. పుణ్యఫలానికి నోచుకున్నారు.

# 9. మానవ సేవలో...

ముస్లిమ్ రాజ్య అధినేతను ఖలీఫా అంటారు. అనేక మంది సమర్థులు చరిత్రలో ఈ పదవిని పొందారు. పేరు ప్రతిష్ఠలు పొందారు. ఈనాటి రాజులు, మంత్రులు, సేనాధిపతులను మించి ఎన్నో రెట్ల సేవ చేశారు ఈ ప్రజా ప్రతినిధులు. వీరు నిరాడంబర జీవులు. సుఖ సౌఖ్యాలకై ధనం వెచ్చించేవారు కాదు. సామాన్య మనిషిలా జీవితం గడిపేవారు.

ఇలాంటి వారిలో హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఒకరు. ఈయన ఇస్లామ్ సేవాపరుడు. దైవ మార్గంలో సేవ చేయడమే ఆయన కర్తవ్యం.

ఒకనాడు రాత్రి సమయం. మండే వేసవి కాలం. ఖలీఫా పడకపై పరుండి రాజ్య కార్యకలాపాల గురించి యోచిస్తున్నారు. విపరీతంగా ఉక్కబోస్తోంది. ఒళ్ళంతా చమటలు పట్టాయి. చమట బిందువులు కారుతుండగా పరిచారిక వచ్చింది. విసన కర్రతో గాలి విసరడం మొదలు పెట్టింది. కాని ఇంతలోనే అలసిపోయిన ఆమెకు నిద్రపట్టింది.

ఖలీఫా లేచారు, ఆమె వద్దనున్న విసనకర్ర తీసుకొని పరిచారికకు గాలి విసరడం మొదలుపెట్టారు. కొద్దిసేపట్లో ఆమె నిద్ర నుండి మేల్కొన్నది. ఎదుటనే నిలబడిన ఖలీఫా చేతిలో విసనకర్ర ఉంది, ఆయనే ఆమెకు గాలి విసురుతున్నారు. పరిచారిక సిగ్గుపడింది. భయంతో వణుకుతూ నిలబడింది. ఇక ఆమెతో ఖలీఫా అన్న మాటలు వినండి:

"కంగారు పడుతున్నావెందుకు? నీవు కూడా నాలాంటి వ్యక్తివే కదా? చమటపోసి నేను బాధపడుతున్నప్పుడు విసన కర్రతో విసిరి నాకు విశ్రాంతి కలుగజేశావు. ఇక నీకు ఉక్క పోయుచుండగా నేను గాలి విసరటంలో తప్పేముంది?" మానవ సేవలో అంతస్తు అడ్డుపడరాదు.

## 10. పొరుగువారితో...

మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి సహచరులను "సహాబా" అని అంటాము. సహాబా సద్గుణ సంపన్నులు. వారిలో అబ్దుల్లా (ర) ఒకరు. ఈయన సచ్ఛీలురేకాక మహా ప్రవక్త పట్ల అమిత వినయ విధేయతలు గలవారు.

ఒక రోజు అబ్దుల్లా (ర) ఇంట అల్లాహ్ పేర ఒక మేక కోయబడింది. ఆనాడు అబ్దుల్లా (ర) ఏదో పని మీద బయటకు వెళ్ళారు, సాయంత్రానికల్లా ఇల్లు చేరుకున్నారు. వారి ఇంటి పక్కన ఒక యూదుడుండేవాడు. ఇంటికి వచ్చిన అబ్దుల్లా "పొరుగువారికి మాంసం పంపారా" అని అడిగారు.

"పొరుగున యూదుడుండగా అతనికెలా మాంసం పంపగలమ"ని సమాధానమిచ్చారు ఆడవారు. అబ్దుల్లా (ర) కు కోపం వచ్చింది, విచారం కలిగింది.

"అతడు యూదుడయితే మాత్రం....?మన పొరుగువాడే కదా? మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనేకసార్లు పొరుగు వారి హక్కుల విషయంలో హెచ్చరించారు. పొరుగున ఉండే వ్యక్తులు ముస్లిములయినా, ముస్లిములు కాకపోయినా వారిపట్ల సత్ప్రవర్తన కలిగివుండాలని ప్రబోధించారు ప్రవక్త (సఅసం)."

వెంటనే ఇంటి ప్రక్కనున్న యూదునికి మాంసం పంపారు అబ్దుల్లా (రఅ).

## 11. అపకారికి ఉపకారము

ఒకప్పటి విషయం. ధర్మయుద్ధం జరుగుతోంది. హజ్రత్ అలీ (రఅ) ఆ యుద్ధంలో ఉన్నారు. ఒక విరోధితో ముఖాముఖి పోరాడుతున్నారు. హజ్రత్ అలీ బహుబల పరాక్రమశాలి. గొప్ప సాహసవంతులు కూడ. విరోధి కూడ కండబలం కలవాడే. అయినప్పటికీ హజ్రత్ అలీతో పోరాడటం అంత తేలికయిన పనికాదు. హజ్రత్ అలీ (ర) ఒకే పట్టులో విరోధిని చిత్తుచేశారు. విరోధి రొమ్ముపై కూర్చున్నారు.

ఇక ఖడ్గం చేబూని అతన్ని హతమార్చడమే తరువాయి. ఇంతలో ధైర్యం కోల్పోయిన విరోధి హజ్రత్ అలీ ముఖంపై ఉమ్మేశాడు.

అల్లుడు చేసిన నీచపు చేష్ట భరింపరానిది. కాని హజ్రత్ అలీ (ర) వెంటనే అతని ఛాతీపై నుండి లేచి వచ్చేశారు. "నిన్నిక చంపను. లే, లేచిపో. ఇందాక దైవ ప్రీతి కోసం ధర్మయుద్ధంలో నీతో పోరాడాను. నిన్ను చిత్తుచేసి చంపదలచాను కూడ. కాని నీ ఈ దుశ్చేష్ట నన్ను కుపితుని గావించింది. ఆగ్రహం మానవుణ్ణి స్వార్థపరునిగా చేస్తుంది. స్వార్థంతో కూడిన వధ ప్రతీకారం కాగలదు. అట్టి ప్రతీకారానికి దేవుని ఎదుట సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది. నిశ్చయంగా నీవు నన్ను అగౌరవపరచావు కాని ప్రతీకార నిమిత్తం స్వార్థంతో మానవ రక్తాన్ని చిందించటం సాహసం కాదు. అది పిరికితనం అనబడుతుంది" అన్నారు హజ్రత్ అలీ (ర).

అసమానమయిన హజ్రత్ అలీ సౌశీల్యం విరోధినాకర్షించింది. అతని మనోహృదయాలందు వెంటనే మార్పు కలిగింది. ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్ అయ్యాడు.

## 12. రహస్యం

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సహచరులలో హజ్రత్ అనస్ (ర) ఒకరు. బాల్యం నుండే ఆయన సత్ప్రవర్తన గలవారు.

ఒకనాడాయన తోటి బాలురతో ఆటలాడుకొనుచుండగా మహాప్రవక్త (సఅసం) అదే మార్గాన వచ్చారు. దగ్గరికొచ్చి బాలురకు సలామ్ చేశారు. అనస్ (ర)ను పిలిచి ఒక పని మీద ఎక్కడికో పంపారు. ఆ పని అయ్యేవరకు ఆలస్యం అయింది. ప్రొద్దుపోయాక ఇల్లు చేరారు హజ్రత్ అనస్ (ర).

"అనస్ (ర) ! ఇంతసేపు ఎక్కడున్నావు?" అని తల్లి అడిగింది.

"ఒక అవసరమయిన పని మీద మహా ప్రవక్త (సఅసం) నన్ను పంపారమ్మా. అందువల్ల ఆలస్యం అయింద"ని అన్నాడా బాలుడు.

"ఏం పని నాయనా?" మళ్ళీ అడిగింది ఆమె.

"అదొక రహస్యం" అన్నారు అనస్ (రఅ).

"చూడు నాయనా! ఈ రహస్యాన్ని ఇంకెవరితో చెప్పకు" అన్నదామె.

తల్లి చెప్పిన మాటను గుర్తుంచుకున్నారు హజ్రత్ అనస్ (ర). ఇక ఎప్పుడూ ఎవరికీ ఆ రహస్యం తెలుపలేదు.

సాబిత్ (ర) అనస్ (ర) కు ప్రాణస్నేహితులు. ఒకనాడు తల్లీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణ ఆయనకు వినిపించారు అనస్ (ర). ఇంకా ఆయనిలా అన్నారు: "ఓ సాబిత్! ఆ రహస్యం ఎవరితోనయినా చెప్పి ఉంటే నీకూ తప్పక తెలిపి ఉండేవాడ్ని."

రహస్యాన్ని గుప్తంగా ఉంచటం ఎంతో అవసరం చూశారా, హజ్రత్ అనస్ (ర) ప్రాణ స్నేహితునికి కూడ రహస్యం చెప్పకుండా ఎలా దాచి ఉంచారో!

# 13. సత్యవచనం

తరచూ పెద్దలు షేక్ అబ్దుల్ ఖాదర్ జీవిత విషయాలు చెబుతూ ఉంటారు. ఈయన "గీలాన్" పట్టణవాసి. అందుకే ఆయన పేరుతోపాటు గీలాని అని వ్రాయబడుతోంది. ఈయన అమిత దైవభక్తిపరులు. మహనీయులు కూడ.

షేక్ అబ్దుల్ ఖాదర్ గీలాని బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. విద్యాభ్యాసం అంటే అమిత ఆసక్తి ఆ బాలునికి. ఆ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఉన్నత విద్య చదవదలిచారు.

ఆ కాలంలో బాగ్దాద్ పట్టణం పండితులకు నిలయం. ఒకనాడు షేక్ అబ్దుల్ ఖాదర్ గీలాని తల్లి దగ్గరకు వచ్చారు. "అమ్మా! ఉన్నత విద్యకై బాగ్దాదు పోదలిచాను. నన్ను బాగ్దాద్ పంపమ్మా" అని ప్రాధేయపడ్డారు. మాతృ హృదయం కరుణామృతం. "సరే నాయనా" అంది తల్లి.

ఈ రోజుల్లా ఆ కాలంలో దూర ప్రయాణం సులభసాధ్యమయింది కాదు. కాలి నడకన లేక జంతువులపై స్వారీ చేస్తూ ప్రయాణం చేయవలసిన కాలం

అది. ఇక మార్గాలు కూడా శాంతియుతమయినవి కావు. దోపిడీలు ఎక్కువగా జరిగేవి. అంచేతనే ప్రయాణీకులు ఎప్పుడూ కలసి ప్రయాణించేవారు.

అప్పట్లో ఒక బృందం బాగ్దాద్ వెళ్ళనుంది. షేక్ అబ్దుల్ ఖాదర్ గీలాని వారితో కలసి బాగ్దాద్ వెళ్ళ నిశ్చయించారు. ప్రయాణపు దినం వచ్చింది. దుస్తులు వేసుకున్నారు. ఆ వేసుకున్న దుస్తులలోనే సంక భాగాన నలభయి దీనార్లు భద్రపరచి ఇచ్చింది తల్లి. వీడ్కోలు ఇచ్చేటప్పుడు ఒక ఉపదేశం ఇచ్చింది ఆ మహా తల్లి.

"నాయనా! ఒక్క మాట మాత్రం మరువకు. ఎన్ని ఆపదలు వచ్చినా సరే, ప్రాణాపాయం ముంచుకువచ్చినా సరే, అబద్ధం పలుకరాదు, సత్యమే పలుకు" అని కోరింది తల్లి.

బాటసారుల బిడారు బాగ్దాద్ మార్గం పట్టింది. షేక్ అబ్దుల్ ఖాదర్ వారితో ప్రయాణం సాగించారు. కాని కొంత దూరం వెళ్ళగానే దొంగల ముఠా వారిని ముట్టడించింది. సమస్తం దోచుకుంది.

ముఠాలోని దొంగ ఒకడు షేక్ అబ్దుల్ ఖాదర్ గీలాని దగ్గరకు వచ్చాడు. "ఒరే అబ్బాయి! నీ దగ్గర ఏమన్నా ఉందా?" అని అడిగాడు. "ఆ ఉన్నాయి, నలభయి దీనారులున్నాయి" అని అన్నాడా బాలుడు. బాలుడు ధరించిన సాధారణ వస్త్రాలు చూశాడు దొంగ. అతని మాటలు పరిహాసంతో కూడినవని అనుకున్నాడు. బాలుని వదలి వెళ్ళాడు.

ఇంకా ఇతర దొంగలు కూడా ఆ బాలుని అలాగే ప్రశ్నించారు. అందరికీ అదే సమాధానమిచ్చాడు షేక్. చివరకు ముఠా నాయకుడే వచ్చాడు. "అవి ఎక్కడున్నాయి?" అని కసిగా అడిగాడు. "అంగవస్త్రాలలో సంక భాగాన ఉన్నాయి" అన్నాడా సత్యవంతుడు. దొంగలు దుస్తులను చించారు. నలుబది దీనార్లు కనుగొన్నారు. దొంగల నాయకుడు ఆశ్చర్యపోయాడు.

"ఏం బాబూ! దీనార్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో అంత జాగ్రత్తగా వాటిని భద్రపరిచావు. మరి మేము అడిగిన వెంటనే నిజం తెలిపావు. కారణం?" అన్నాడా నాయకుడు.

"తల్లి ఇచ్చిన ఆజ్ఞను నేనెలా జవదాటగలన"ని సమాధానమిచ్చాడు గీలాని. బాలుని నిజాయితీ ముఠా నాయకునిపై ప్రభావం వేసింది. అతని మనోహృదయాలందు సంచలనం కలిగింది. దీర్ఘంగా ఆలోచించాడు. "చిన్న పిల్లవాడికి తల్లి మాటంటే ఇంతటి గురి. ఇక నేనూ ఉన్నాను. దేనికీ? అల్లాహ్, ఆయన ప్రవక్త ఆజ్ఞలను లెక్క చేయకుండా దోపిడీలు చేస్తూ తిరుగుతున్నాను" అని తన తప్పును గుర్తించాడు. పశ్చాత్తాపం చెందాడు. ముఠా నాయకుడు, తోటి దొంగలు విశ్వప్రభువుతో ప్రాయశ్చిత్తం వేడుకొన్నారు. దొంగిలించిన వస్తు సామగ్రిని బాటసారులకు అప్పగించారు. సత్ప్రవర్తనతో మెలగసాగారు.

## 14. దానధర్మముల వస్తువులు

దానధర్మాల పేరుతో అనేక వస్తువులు పంచబడుతాయి. ఒకప్పుడు మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇంటికి దాన ధర్మపు ఖర్జూరపు పండ్లు పంపబడ్డాయి. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆ వస్తువులను స్వయంగా గాని, ఇంటి వారి కొరకుగాని వాడేవారు కారు. తమ వద్దకు పంపబడిన అట్టి వస్తువులను నిరుపేదలకు తిరిగి పంచిపెట్టేవారు.

ఆ రోజు వచ్చిన ఖర్జూరపు పండ్లను అట్టే పెట్టారు. ఇంతలో మహా ప్రవక్తగారి ముద్దుల మనుమడు అటు వచ్చారు. ఆ బాలుని పేరు హుసైన్ (ర). అతడింకా పిన్న వయస్కుడు. దానధర్మపు వస్తువులను ఇంటివారు తినరాదన్న మహాప్రవక్త (సఅసం) ఆజ్ఞ ఆ బాలునికి ఇంకా తెలియదు. దుడుకు వయస్సు. కిటికీపై ఉన్న ఖర్జూరపు పండ్లలో నుండి ఒక పండు తీసుకొని నోట్లో వేశాడు. ఇంతలో మహాప్రవక్త దృష్టిపడింది, "నాయనా! ఖర్జూరపు పండు అక్కడే ఉంచేయి, దానధర్మాల పేర వచ్చిన వస్తువులను మనం వాడుకోవటం సహేతుకం కాదు" అని మందలించారు, వెంటనే హజ్రత్ హుసైన్ నోట వేసుకొనిన పండును తీసి అక్కడే ఉంచేశారు.

-: సమాప్తం :-